

పెరుగుతున్న పెద్దేరు 8లో

పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. వరుస వర్షాలతో జలాశయానికి 40 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.



ఏయూలో ధ్యాన, జ్ఞాన క్షేత్రం

విశాఖ: ఏయూలో మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి.



ఉత్సాహంగా ఏఎంసీ వాక్

విశాఖ: ఆంధ్రా మెడికల్ కళాశాల వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీచ్‌రోడ్డులో బుధవారం వాక్‌థాన్ జరిగింది.

న్యూస్‌రీల్

ప్రతి పైసా సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు

- గత ప్రభుత్వంలో మాదిరి దుబారా చేయడం లేదు
- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి అమర్‌నాథ్ స్పందన

మహారాణిపేట(విశాఖ దక్షిణ): రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు లోబడే అప్పు చేస్తోందని, తెచ్చిన ప్రతి రూపాయి ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై దర్యాప్తు జరిపిస్తామని, ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకువెళ్లామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేసిందన్నారు. దీనికి అవసరమైన మొత్తాన్ని నిబంధనల మేరకు వివిధ రూపాల్లో సేకరిస్తుందన్నారు. ఈ నిధులను దుబారా చేయడం లేదని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన అప్పులకు లెక్కా జమా లేదని ఆయన ఆరోపించారు. ఆయన హయాంలో అప్పుల గురించి ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పైసాకు లెక్క చెబుతుందన్నారు. ఆమె నిజాలు తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

అమెజాన్‌లో 'మేటి'కొప్పాక



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

- లక్కబొమ్మల అమ్మకానికి సర్వం సిద్ధం
- మహిళా కళాకారులతో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమావేశం 8లో



విజయదుందుభి మోగించిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు కేకే రాజు, ఆడారి ఆనంద్



- జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా
- అత్యధిక మెజార్టీతో అన్ని స్థానాలు కైవసం
- మెజార్టీ లేకున్నా పోటీ చేసి భంగపడ్డ టీడీపీ



ఓటింగ్‌లో పాల్గొన్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. అన్ని స్థానాలూ కైవసం చేసుకుంది. సంఖ్యా బలం లేకపోయినా నామినేషన్ల పేరిట హడావుడి చేసిన టీడీపీ చివరకు డీలా పడింది. గ్రేటర్‌లో మొత్తం 98 మంది కార్పొరేటర్లకు గాను ఒకరు ఎమ్మెల్సీ (వంశీకృష్ణ శ్రీనివాస్)గా నియమితులు కావడంతో 97 మందే ఉన్నారు. సంఖ్యా బలంగా వైఎస్సార్ సీపీకి 64 మంది (ముగ్గురు స్వతంత్రులు, ముగ్గురు టీడీపీ కార్పొరేటర్ల మద్దతుతో కలిపి), 26 మంది టీడీపీ, ముగ్గురు జనసేన + స్వతంత్ర కార్పొరేటర్, సీపీఎం, సీపీఐ, బీజేపీ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరిలో సీపీఎం, సీపీఐ, జనసేనకు చెందిన ముగ్గురు, స్వతంత్ర కార్పొరేటర్ ఒకరు స్థాయీ సంఘ ఎన్నికకు దూరంగా ఉన్నారు. అనివార్య కారణాల వల్ల వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు ఓటింగ్‌కు రాలేదు. 89 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎవరెవరికి ఎన్ని ఓట్లు

వైఎస్సార్ సీపీ నుంచి బరిలో దిగిన ఉరికిటి నారాయణరావుకు 66, అక్కరమాని పద్మకు 64, పీలా లక్ష్మీసౌజన్యకు 64, కోడిగుడ్ల పూర్ణిమకు 63, కంటిపాము కామేశ్వరికి 63, బల్ల లక్ష్మణరావుకు 63, భూపతిరాజు సుజాతకు 63, గుడ్ల విజయసాయికి 62, బట్టు సూర్యకుమారికి 62, చల్లా రజనికి 61 ఓట్లు పోలవ్వగా.. ప్రతిపక్ష టీడీపీ నుంచి బరిలో దిగిన గోడి విజయలక్ష్మికి 24, నొల్లి నూకరత్నకు 24, పిసిని వరహా లక్ష్మీనరసింహకు 28, పిల్లా మంగమ్మకు 25, బల్ల శ్రీనివాసరావుకు 28, బొమ్మిడి రమణకు 28, మద్దెల రామలక్ష్మికి 27, ముక్కా శ్రావణికి 26, శరగడం రాజశేఖర్‌కు 24, గంధం శ్రీనివాసరావుకు 25 ఓట్లు వచ్చాయి.

సీఎం జగన్ తమకిచ్చిన బలంతోనే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకిచ్చిన బలంతోనే స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించిందని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల వైఎస్సార్ సీపీ పరిశీలకుడు, మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. బలం లేకుండా ఇతర పార్టీల నుంచి ఓట్లు సంపాదించుకోవాలన్నదే చంద్రబాబు దురుద్దేశమని.. అదే ఇక్కడి టీడీపీ నాయకుల్లో కూడా స్పష్టంగా కనిపించిందన్నారు. అయితే కొందరు టీడీపీ కార్పొరేటర్లు జగనన్న పనితీరును మెచ్చి వైఎస్సార్ సీపీకి చెందిన కార్పొరేటర్లకు ఓట్లు వేశారంటే ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. కలిసికట్టుగా పనిచేశాం.. విజయం సాధించామని తెలిపారు. స్థాయీ సంఘ ఎన్నికలకు సహకరించిన ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, నియోజకవర్గ సమన్వయకర్తలు కేకే రాజు, అక్కరమాని విజయనిర్మల, ఆడారి ఆనంద్‌తోపాటు కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ పాలనకు ఈ విజయమే నిదర్శనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు వరుసగా 3వ సారి విజయం సాధించామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ఊహించిన దానికన్నా ఎక్కువగా ఓట్లు పోలయ్యాయని, ప్రతిపక్ష పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేశారంటే అది సీఎం జగన్ పరిపాలన తీరుకు నిదర్శనమన్నారు. ఇదిలా ఉండగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మహా నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే.. చంద్రబాబు అడ్డుతగలడం సిగ్గు చేటన్నారు. స్థాయీ సంఘ ఎన్నికలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు



ఓటింగ్‌కు మంత్రి అమర్నాథ్‌తో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్ తదితర నేతలు



ఓటింగ్ పూర్తయిన తర్వాత సీలు వేయిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

స్టాండింగ్ కమిటీ సభ్యులు వీరే..

అక్కరమాని పద్మ	(1వ వార్డు)
గుడ్ల విజయసాయి	(23వ వార్డు)
ఉరికిటి నారాయణరావు	(29వ వార్డు)
కోడిగుడ్ల పూర్ణిమ	(41వ వార్డు)
కంటిపాము కామేశ్వరి	(47వ వార్డు)
చల్లా రజని	(54వ వార్డు)
బల్లా లక్ష్మణరావు	(62వ వార్డు)
భూపతిరాజు సుజాత	(73వ వార్డు)
బట్టు సూర్యకుమారి	(77వ వార్డు)
పీలా లక్ష్మీసౌజన్య	(81వ వార్డు)

స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా మేయర్

స్టాండింగ్ కమిటీకి చైర్‌పర్సన్‌గా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వ్యవహరిస్తారు. జీవీఎంసీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ స్టాండింగ్ కమిటీకి పరిపాలన ఆమోదం తెలిపే అధికారం ఉంటుంది. రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ స్టాండింగ్ కౌన్సిల్ నుంచి కౌన్సిల్‌కు, రూ.2 కోట్లు దాటిన అభివృద్ధి పనులకు సంబంధించి స్టాండింగ్ కమిటీ నుంచి కౌన్సిల్‌కు, అక్కడి నుంచి ప్రభుత్వానికి ఫైల్ వెళ్తుంది. ప్రభుత్వం ఆయా పనులకు పరిపాలన ఆమోదం ఇవ్వాల్సి ఉంటుంది. దుకాణాల లీజులు, ప్రీవియస్ అప్రూవల్, బడ్జెట్ ప్రతిపాదనలు మొదలైన ఆర్థిక, చట్టపరమైన అధికారాలు స్టాండింగ్ కమిటీకి ఉంటాయి.

లక్ష్య సాధనతో ఉజ్వల భవిష్యత్తు

- పాటిపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్



ట్యాబ్ సహాయంతో చదువుకుంటున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మునగపాక: పదో తరగతిలో మంచి ఫలితాలు రావాలంటే ఇష్టపడి, కష్టపడి చదవాలని, లక్ష్య సాధనతో ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. ఆయన బుధవారం పాటిపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి వారి పుస్తకాలు పరిశీలించారు. ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. 9వ తరగతి విద్యార్థులు వినియోగిస్తున్న ట్యాబ్‌లను, వాటి ద్వారా వారికి అందుతున్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఐబీటీకి సంబంధించి జరుగుతున్న ఆన్‌లైన్ క్లాసులు ఎలా నడుస్తున్నాయో గమనించి.. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని, ప్రభుత్వం విద్యకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్ రికార్డులను ప్రిన్సిపల్ శ్రీలక్ష్మిని అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల మరమ్మతులు చేసిన పలు గదులను ఆయన అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

రెండు రోజుల్లో రోడ్డు విస్తరణ ప్రారంభం

నర్సీపట్నం అబిద్ సెంటర్ నుంచి పనులకు శ్రీకారం 8లో

గంగపుత్రుల్లో అలజడి

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- బోట్లు, తెప్పలకు లంగరు
- వేటకు తాత్కాలిక విరామం



సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు (ఇన్‌సెట్) రాజయ్యపేట తీరంలో ఒడ్డున లంగరు వేసిన బోట్లు, తెప్పలు

నక్కపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా గంగపుత్రుల్లో అలజడి మొదలయింది. సముద్రంలో కెరటాలు ఎగిసి పడుతున్నాయి. దీంతో గంగపుత్రులు వేటకు వెళ్లే సాహసం చేయలేక, బోట్లు, తెప్పలకు లంగరు వేశారు. బుధవారం వేటకు విరామం ప్రకటించారు. వాయుగుండం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తీరప్రాంత గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి తోడు వాయుగుండం బలహీనపడి వర్షాలు తగ్గే వరకు వేట లేక పస్తులుండాల్సి వస్తుందేమోనన్న బెంగ వారిలో పట్టుకుంది. రెండు నెలల వేట విరామం తర్వాత జూన్ 1 నుంచి వేట ప్రారంభమయిందని, నెలరోజులపాటు సాగిన అనంతరం జూలై నెలలో వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగా సరిగ్గా వేటకు వెళ్లలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలమైన గాలులు వీచడంతో బోట్లకు లంగరు వేసి తెప్పలు, ఇంజన్లు, వలలను ఒడ్డున భద్రపరచుకున్నారు. సముద్రంలో కెరటాలు ఎగిసి పడుతున్నాయని ఉవ్వెత్తున పైకి లేవడంతో వేటకు వెళ్తే ప్రమాదం తప్పదని భావించి వేటకు వెళ్లడం మానేసినట్లు మత్స్యకారులు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో తీరప్రాంతం వెంబడి 17 మత్స్యకార గ్రామాలున్నాయి. రాజయ్యపేట, పెదతీనార్ల, చినతీనార్ల రేవుపోలవరం, బంగారమ్మపాలెం, కొర్లయ్యపేట, వెంకటనగరం, రాజానగరం, బంగారయ్యపేట, పెంటకోట, రాజవరం తదితర గ్రామాల్లో తీరప్రాంతాల్లో నిర్మానుష్య వాతావరణం నెలకొంది. బోట్లను, తెప్పలను భద్రపరచుకుని ఇళ్ల వద్దే మత్స్యకారులు ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం వచ్చే వరకు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

బాలికల గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.35 కోట్లు

- మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: స్థానిక జ్యోతీరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అత్యధిక ప్రాధన్యం ఇస్తున్నారన్నారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పీజీ కాలేజీని మంజూరు చేసి రెండేళ్లుగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి వెంకన్నపాలెం సమీపంలో 6 ఎకరాల స్థలాన్ని సమకూర్చి, రూ.15 కోట్లు మంజూరు చేశామని, ఈనెలలో పనులు ప్రారంభిస్తామన్నారు. జ్యోతీరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాల కోసం జన్నవరంలో 10 ఎకరాల స్థలం సేకరించామన్నారు. సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయమని ముఖ్యమంత్రిని కోరిన వెంటనే రూ.35 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని ధర్మశ్రీ చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

అనుసంధానానికి సన్నాహాలు

- విశాఖకు ఏలేరు నీటి తరలింపులో ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ప్రత్యామ్నాయాలు పరిశీలించిన ఇరిగేషన్ ఉన్నతాధికారులు
- వర్షాకాలం ముగిశాక తాండవ-ఏలేరు అనుసంధానానికి శ్రీకారం
- ఇంజినీర్ ఇన్ చీఫ్ సతీష్‌కుమార్ వెల్లడి



జిల్లేడుపూడి వద్ద ఏలేరు కాల్వలోకి తాండవ నీటిని తరలించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్

నాతవరం: ఏలేరు–తాండవ అనుసంధానం పనుల కోసం.. ఏలేరు కాల్వలో నీటి సరఫరాను నిలిపివేయడం వల్ల విశాఖ నగరానికి ఇబ్బంది లేకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్ కుమార్, ఉత్తర కోస్తా సీఈ ఎస్.సుగుణాకరరావు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నాతవరం మండలం జిల్లేడుపూడిలో ఏలేరు సారంగం వద్ద తాండవ ప్రాజెక్టు కాల్వలను వారు కాంట్రాక్టరుతో కలిసి పరిశీలించారు. ఏలేరు, తాండవ ప్రాజెక్టుల అనుసంధానానికి ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు రూ.470 కోట్ల 5 లక్షలను కేటాయించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తారు. ఏలేరు కాల్వలో ప్రవహించే నీటిని నిలుపుదల చేస్తే తప్ప పనులు మొదలుపెట్టే అవకాశం లేదు. ఏలేరు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్, జీవీఎంసీ, పరిశ్రమలకు రోజుకు 95 జీఎండీల నీరు అవసరమని, వాటికి నీటిని అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించామని అధికారులు చెప్పారు. తాండవ రిజర్వాయర్ నీటిని జిల్లేడుపూడి వద్ద ఏలేరు కాల్వలోకి డంప్ చేసి విశాఖకు తరలించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. ముందు ఏలేరు ప్రాజెక్టు నీటిని పెదగొలుగొండపేట వద్ద నుంచి పైపులైను ద్వారా తాండవ ప్రాజెక్టులోకి తరలించి, ఆ తర్వాత తాండవ నీటిని విశాఖకు తరలించేందుకు ఆలోచన చేస్తున్నామని, తాండవ నీటిని తరలించే ముందు ఆయకట్టు రైతులకు, ప్రజాప్రతినిధులకు వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ భాస్కరరావు, డీఈ వినోద్‌కుమార్, విస్కో సలహాదారు, విశ్రాంత ఎస్‌ఈ జగన్మోహన్‌రావు, తాండవ ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు, జేఈలు శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్, ఆర్.పాత్రుడు, రామకృష్ణ, నాగబాబు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమెజాన్‌లో 'మేటి'కొప్పాక

- లక్కబొమ్మల అమ్మకానికి సర్వం సిద్ధం
- మహిళా కళాకారులతో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమావేశం

యలమంచిలి: అమెజాన్ సంస్థ అనుసంధానంతో ఏటికొప్పాక లక్కబొమ్మలను విక్రయించేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తయిందని అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి చెప్పారు. బుధవారం ఏటికొప్పాక గ్రామంలో ఆమె పర్యటించారు. అమెజాన్ కన్సల్టెంట్ పూజతో కలిసి ఆమె స్థానిక మహిళా కళాకారులతో సమావేశమయ్యారు. వారితో లక్కబొమ్మల తయారీ శిక్షణపై చర్చించారు. అమెజాన్ వంటి సంస్థల ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో ఏటికొప్పాక లక్కబొమ్మలు నిలవాలంటే సహజసిద్ధమైన రంగులను మాత్రమే వాడాలని, తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. స్థానిక సొసైటీ భవనంలో రంగులు అద్దే కొత్త లేత్ మిషన్లను ఏర్పాటు చేస్తామని, ఉత్సాహం ఉన్న మహిళా కళాకారులు అందులో శిక్షణ పొందవచ్చునని చెప్పారు. ఏటికొప్పాక లక్కబొమ్మల విలువను ప్రపంచానికి చాటి చెప్పాలనేదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశమని, ప్రతి ఒక్కరు ఉత్సాహంగా శిక్షణ పొంది స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం శివారు అచ్యుతాపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ క్లీనర్ మృతి చెందాడు. అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం..యలమంచిలి నుంచి తాళ్లపాలెం వైపు బొగ్గుల లోడు కోసం వస్తున్న లారీని వెనుకగా వచ్చిన మరో లారీ ఢీకొంది. దీంతో వెనుక లారీ కేబిన్ దెబ్బతిని దానిలో చిక్కుకున్న క్లీనర్ రాజేష్‌కుమార్ సాకేత్ (30) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి

యలమంచిలి: ఓటర్ల జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ నేతలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెలాఖరు వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు, చనిపోయిన, శాశ్వతంగా వేరే గ్రామాలకు వెళ్లిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితానుంచి తొలగిస్తారని తెలిపారు. ఇందుకు రాజకీయపార్టీల నాయకులు సహకరించాలన్నారు. జాబితాలో పేర్లను సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాణీ అమ్మాజీ, రాజకీయ పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటింట సర్వే

మాకవరపాలెం: ఓటర్ల జాబితా సవరణపై ఈ నెల 21 నుంచి ఇంటింట సర్వే నిర్వహించనున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం బీఎల్‌వోలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి జాబితాలో ఉన్న ఓటర్లు స్థానికంగా ఉన్నారా.. లేదా, మరణించినప్పటికీ జాబితాల్లో పేర్లు ఉండటం, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారి వివరాలపై సర్వే చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారి వివరాలను కూడా సేకరించాలన్నారు. ఎవరి ఒత్తిళ్లకు లోనుకాకుండా సర్వే చేపట్టాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతో విజయాలు

కశింకోట: జీవన నైపుణ్యాలతో ఆధునిక ప్రపంచంలో విజయాలు సాధించవచ్చని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. జీవన నైపుణ్యాలపై ప్రభుత్వ పాఠశాలల పీడీలు, ఇతర ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న 11 జీవన నైపుణ్యాలు విద్యార్థులకు బోధించి వారు విజయాలు సాధించేలా కృషి చేయాలన్నారు. జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు మానవులను సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. వీటిని ఉపాధ్యాయులు బోధించి విద్యార్థులను ఉత్తములుగా తీర్చి దిద్దాలన్నారు. డైట్ అధ్యాపకురాలు జె.మాధవి, రీసోర్స్ పర్సన్లు అబ్దుల్ రెహమాన్, సుశీల, వెంకటరావు, మేజిక్ బస్సు జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌కుమార్‌రాజు, హెచ్‌ఎం శేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ సుధాకర్

మూడు తాటాకు ఇళ్లు దగ్ధం



గునుపూడిలో మంటను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాతవరం: మండలంలోని గునుపూడిలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. పసగడుగుల కన్నబాబు, పి.నాగరాజు, పలకా అచ్చియ్యమ్మకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. కన్నబాబు ఇంట్లో గ్యాస్ స్టౌపై మధ్యాహ్నం వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది. నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చే సరికే ఇళ్లు కాలి బూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

రూ.433 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

నాతవరం: జిల్లాలో నాడు–నేడు పథకంలో రెండు విడతల్లో రూ.433 కోట్ల 65లక్షలతో 1,217 పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. మండలంలో మన్యపురట్ల హైస్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యా కానుక కిట్ల పంపిణీ, ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. హైస్కూల్‌లో సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధనతో పాటు ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మొదట విడత కింద 613 పాఠశాలల్లో రూ.181కోట్ల 65 లక్షలతో పనులు పూర్తి చేశామన్నారు. రెండవ విడతలో జిల్లా వ్యాప్తంగా 604 పాఠశాలల్లో రూ.252 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు.పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. నాడు–నేడు మొదట విడతలో పనులు పూర్తి చేసిన పాఠశాలలకు స్మార్ట్ టీవీలు అందజేస్తున్నట్టు చెప్పారు. నాతవరం మండలంలో 26 పాఠశాలలకు స్మార్ట్ టీవీలు అందజేశామని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ బోధన జరుగుతోందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు తాడి అమృత్‌కుమార్,కామిరెడ్డి వరహాలబాబు, హెచ్‌ఎం రామారావు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

ఐదుగురు జూదరుల అరెస్టు

బుచ్చెయ్యపేట: గొర్లెపాలెంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా రూ.15,082 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పెద్దేరులో పెరుగుతున్న నీటిమట్టం

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జలాశయానికి 40 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడంతో జలాశయంలోకి కొత్తనీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 135.10 మీటర్లకు నీటి మట్టం చేరింది. రెండు రోజుల క్రితం 134.20 మీటర్ల నీటి మట్టం ఉండేది. ఖరీఫ్ పంటలకు నీటికి ఢోకా ఉండదని జలాశయం అధికారులు చెబుతున్నారు.

బైక్ పైనుంచి పడి ఆర్టీసీ డ్రైవర్ మృతి



రాజుమృతదేహం, మరణించిన రాజు ఫైల్‌ఫోటో

నక్కపల్లి: జాతీయరహదారిపై గొడిచర్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. వేంపాడుకు చెందిన కళ్లేపల్లి వెంకటసుబ్రహ్మణ్యంరాజు(51) తుని ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి డిపోనుంచి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా గొడిచర్ల వద్ద వాహనం అదుపుతప్పి కిందపడడంతో రాజుతలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నక్కపల్లి పోలీసులు తెలిపారు.

ట్రావెల్ బస్సు ఢీకొని యాచకుడు మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం రామన్నపాలెం వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యాచకుడు మృతి చెందినట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు చెప్పారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గ్రామ రెవెన్యూ సహాయకులు దీక్షల్లో పాల్గొనవద్దు

- ఏపీ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పారావు

మాడుగుల రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకులు ఎలాంటి దీక్షల్లో పాల్గొనవద్దని ఏపీ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోని చిన అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమానికి కృషి చేస్తుంటే.. మండల కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టాలని కొన్ని సంఘాలు పిలుపునివ్వడం శోచనీయమన్నారు. ఈనెల 20,21 తేదీల్లో దీక్షలు చేపట్టడానికి సిద్ధం అవుతున్నారని, ఆ దీక్షల్లో గ్రామ రెవెన్యూ సహాయకులెవరూ పాల్గొనవద్దని ఆయన పేర్కొన్నారు.

దంపతుల ఆత్మహత్య

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక సమస్యలే కారణంగానే వీరు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ముద్రగళ్ల వెంకట కృష్ణప్రసాద్(54), అతని భార్య రాజరాజేశ్వరి(50) చాలా కాలం క్రితం నగరానికి వలస వచ్చారు. వారికి సంతానం లేదు. కృష్ణప్రసాద్ ప్రస్తుతం ప్యూర్‌ఫై వాటర్ సరఫరా వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల కొమ్మాది అయ్యప్పనగర్‌లో అద్దెంటికి మారాడు. వీరితోపాటు ఆయన అక్క ఉంటోంది. ఇదిలా ఉండగా వెంకట కృష్ణప్రసాద్ దంపతులు ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తమ గదిలో పడుకున్నారు. బుధవారం ఉదయం వారు ఎంతకీ నిద్ర లేవకపోవడంతో కృష్ణప్రసాద్ అక్క తలుపులు కొట్టింది. అయినా తీయకపోవడంతో రాజమండ్రిలో ఉంటున్న బంధువులకు ఫోన్ చేసింది. వారు ప్రసాద్ వద్ద పనిచేస్తున్న సుమన్ అనే వ్యక్తికి ఫోన్ చేయగా అతడు వచ్చి గది తలుపులు తెరిచి చూడగా మంచంపై విగతజీవులుగా పడి ఉన్నారు. వెంటనే అతడు పోలీసులకు సమాచారం అందించాడు.



ఆత్మహత్యకు పాల్పడిన ముద్రగళ్ల వెంకట కృష్ణప్రసాద్, అతని భార్య రాజరాజేశ్వరి (ఫైల్)



మంచంపై మృతదేహాలు

ఆర్థిక సమస్యలే కారణమా?

దంపతులు ఆత్యహత్య చేసుకోవడానికి గల కారణాలు పోలీసులు పరిశీలించగా అనేక విషయాలు వెలుగుచేశాయి. నర్సీపట్నంకు చెదిన సుధాకర్ అనే వ్యక్తి స్మార్ట్ విలేజ్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగాలు వేయిస్తానని ఉత్తరాంధ్రకు చెందిన వందలాది నిరుద్యోగుల నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకూ వసూలు చేశాడు. కృష్ణప్రసాద్, రాజరాజేశ్వరి ఈ సంస్థలో పనిచేశారు. ఆ సమయంలో ఈ దంపతులను నమ్మి పలువురు డబ్బులు చెల్లించారు.

తరువాత సుధాకర్ పత్తాలేకుండా పోయాడు. తాము ఇచ్చిన సొమ్ము చెల్లించాలని ప్రసాద్‌పై నిరుద్యోగులు ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై రణస్థలం పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ కేసు నమోదై ఉంది. తన ప్లాట్లు, ఇళ్లస్థలాలు, వాటర్ ప్లాంట్ తదితర ఆస్తులు అమ్మి 100 మందికి పైగా నిరుద్యోగులకు వారు ఇచ్చిన సొమ్ము చెల్లించాడు. మరికొంతమందికి వచ్చే ఆగస్టు నెలలో చెల్లించేందుకు అంగీకరించాడు. ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించలేని పరిస్థితి, తీవ్ర మానసిక ఒత్తిడితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అతని డైరీ స్వాధీనం చేసుకున్నామని, దీని ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు. మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. మృతుని మేనల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెండు రోజుల్లో రోడ్డు విస్తరణ ప్రారంభం

- అబిడ్ సెంటర్ నుంచి పనులకు శ్రీకారం
- అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గణేష్



ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. అబిడ్ సెంటర్ నుంచి పనులు మొదలుపెట్టాలని నిర్ణయించారు. రోడ్డు విస్తరణపై బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం సమక్షంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ అధికారులతో సమావేశమయ్యారు. విస్తరణ ఏవిధంగా చేపట్టాలి, తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ముందుగా అబిడ్ సెంటర్ నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలను 500 మీటర్ల పొడవున తొలగించేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 500 మీటర్ల పరిధిలో ఎక్కువగా ప్రభుత్వ స్థలాలు, భవనాలు ఉన్నందున ఈ ప్రాంతం నుంచి పనులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల్లో వంద అడుగులకు సంబంధించిన రోడ్డు విస్తరణ పనులకు అధికారులు కార్యాచరణ రూపొందించనున్నారు. రోడ్డు విస్తరణ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణ, టౌన్ సీఐ గణేష్, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

- జేఎస్ ఫార్మాసిటీ స్మైలెక్స్ పరిశ్రమలో ఘటన



నాగులాపల్లి నాగేశ్వరరావు (ఫైల్)

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ పరిశ్రమ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్ షాక్‌తో బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన నాగులాపల్లి నాగేశ్వరరావు (24)ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి సంబంధించి పరవాడ సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. తగరంపూడి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు స్మైలెక్స్ పరిశ్రమలో కొంత కాలంగా విద్యుత్ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం జనరల్ షిఫ్ట్‌కు వచ్చిన ఆయన విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 4 గంటల సమయంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకొన్న యాజమాన్యం ప్రతినిధులు అంబులెన్స్‌లో షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని బుధవారం రాత్రి మృతుని కుటుంబ సభ్యులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. పరిశ్రమ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఈశ్వరరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

తగరంపూడిలో విషాదం

అనకాపల్లి టౌన్: జేఎస్ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ పరిశ్రమలో నాగేశ్వరరావు మృతితో తగరంపూడి గ్రామంలో విషాదం నెలకొంది. చేతికి అందొచ్చిన కుమారుడికి వివాహం చేసి శేషజీవితం ప్రశాంతంగా గడుపుదామనుకుంటే దేవుడు తీరని అన్యాయం చేశాడని తల్లిదండ్రులు రమణమ్మ, తాతీలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వీరికి కుమారుడు నాగేశ్వరరావు, కుమార్తె దేవి సంతానం. కుమార్తెకు ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. కుమారుడికి వివాహం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఏడాది క్రితం నూతన గృహాన్ని కూడా నిర్మించారు. ఇంతలో కొడుకు మృతి చెందడంతో ఆ వృద్ధ దంపతులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

500 బియ్యం బస్తాల సీజ్



దుకాణ యజమాని స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి అనురాధ

నర్సీపట్నం: నియోజకవర్గ కేంద్రం నర్సీపట్నంలో పలు దుకాణాలపై బుధవారం దాడులు నిర్వహించి, తూకాల్లో తేడా ఉండడంతో 500 బియ్యం బస్తాలను సీజ్ చేసినట్టు లీగల్ మెట్రాలజీ అధికారి డి.అనురాధ తెలిపారు. సుతాపల్లి నర్సింహమూర్తి జనరల్ మర్చెంట్ హోల్‌సేల్ దుకాణంతో పాటు మరో నాలుగు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. సుతాపల్లి దుకాణంలో 470, మిగిలిన దుకాణాల్లో 30 బియ్యం బస్తాలను సీజ్ చేసినట్టు చెప్పారు. ఐదు దుకాణాలపై కేసులు నమోదు చేశామన్నారు. తూకంలో తేడా వస్తే ఉపేక్షించేదిలేదని ఆమె హెచ్చరించారు.

ఎనిమిది దుకాణాలపై కేసులు

కశింకోట: మూడు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఎనిమిది దుకాణాలపై బుధవారం కేసులు నమోదు చేసినట్టు అనకాపల్లి లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య తెలిపారు. అనకాపల్లి, కశింకోట, యలమంచిలి ప్రాంతాల్లో ఐదు దుకాణాలను తనిఖీ చేయగా వాటికి డిక్లరేషన్ లేదన్నారు. అలాగే మూడు బియ్యం దుకాణాల్లో తనిఖీ చేసి తూకాల్లో తేడా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. దీంతో ఆయా దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ డి. భాస్కరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకే లక్ష్యం



పిసినికాడలో స్వచ్ఛ సర్వేక్షణ్ సన్నద్ధతపై వివరిస్తున్న సీఈవో శ్రీరామ్మూర్తి



అధికారులతో సమీక్షిస్తున్న సీఈవో శ్రీరామ్మూర్తి

- జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి

అనకాపల్లి రూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 లో మెరుగైన ర్యాంకే లక్ష్యంగా సిద్ధం కావాలని జిల్లా పరిషత్ సీఈవో కె శ్రీరామ్మూర్తి గ్రామస్థాయి యంత్రాంగానికి సూచించారు.బుధవారం మండలంలోని పిసినికాడ గ్రామాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యలోపం లేకుండా చూడాలని సర్పంచ్,పారిశుధ్య ,సచివాలయ సిబ్బందికి సూచించారు. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందం ఇక్కడ పర్యటిస్తుందన్నారు.సర్వే సమయంలో ఏఏ అంశాలు తనిఖీ చేస్తారో వివరించారు. బృందం సంతృప్తి చెందేలా సమాయత్తం కావాలన్నారు. సర్వే బృందం పర్యటించే సమయానికి రికార్డులతో పాటు భౌతిక తనిఖీలో వారు సంతృప్తి చెందేలా పారిశుధ్యం మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పనిచేసి మంచి ర్యాంకు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె ధర్మారావు, సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌పై నిర్లక్ష్యం వద్దు

మాకవరపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై నిర్లక్ష్యం వద్దని జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై ఆరా తీశారు. శాఖలవారీగా వివరాలు తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణశ్రీ, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిద్ర మత్తు

- రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ లక్ష్మీనారాయణ

యలమంచిలి: వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తు అతని ప్రాణం తీసింది. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి హైవే వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామానికి చెందిన బొక్కా లక్ష్మీనారాయణ (28) దుర్మరణం చెందాడు. యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి రొయ్యల లోడుతో బయలుదేరిన వ్యాన్ విశాఖపట్నం జిల్లా గాజువాకకు వెళుతుండగా ... యలమంచిలి 16వ నంబరు జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ చెప్పారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

నర్సీపట్నం: చోరీ కేసులో ఓ వ్యక్తికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పది నెలల జైలు శిక్ష విధించినట్టు టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కుతుండగా కరణం నిరోషా అనే మహిళ బంగారు ఆభరణాలను చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు చోరీకి పాల్పడిన జె.సుధాకర్(23)ను సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శశి కేసు వాదించడంతో నిందితుడికి పది నెలలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని సీఐ తెలిపారు.

గంజాయి రవాణా కేసులో మరో వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్: గంజాయి రవాణా కేసులో మరో వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో ఊడేరు కూడలి మీదుగా మంగళవారం నలుగురు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో ఒకరిని అరెస్టు చేయగా, మిగతా ముగ్గురు పరారయ్యారు. పరారైన వారిలో ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

జగనన్న సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక 82వ వార్డులోని 13, 14 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎన్టీఆర్ క్రీడామైదానం సచివాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు, గృహసారథులు, వలంటీర్లు, ప్రభుత్వశాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఎంపీ కృషి అభినందనీయం

అనకాపల్లిటౌన్: మండలంలో శంకరం గ్రామంలో బొజ్జన్నకొండ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ సత్యవతిని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఎంపీ కార్యాలయంలో బుధవారం కలిశారు. బొజ్జన్నకొండ అభివృద్ధికి ఎంపీ చొరవను అభినందించారు. పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ఎంపీ ప్రస్తావించి, నిధుల మంజూరుకు కృషి చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో పాల్గొనండి

అనకాపల్లిటౌన్: టీడీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి బూత్ ఏజెంట్లు తప్పనిసరిగా బీఎల్‌వోలతో కలిసి ఓటర్ల పరిశీలన ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకుల జాతీయీకరణ వేడుకలు



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: మండలంలో తుమ్మపాల యూనియన్ బ్యాంకు వద్ద బుధవారం బ్యాంకు ఉద్యోగులు బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ బ్యాంకులను జాతీయకరణ చేసి 55 ఏళ్లయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరణను చేస్తూ ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శరగడం శ్రీనివాసరావు, శ్రీధర్, పవన్, సందీప్, రాజు, రాధిక, పి.కీర్తి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు
సోమవారం 108 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,020	4,020
మూడోరకం	3,600	3,900

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-1
ఆదిపురుష్	: సత్యనారాయణ స్క్రీన్-2
రంగబలి	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
నాయకుడు	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 98 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు , బీ పాజిటివ్-41 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం మంది 358 గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 347 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఈ 'బడి'జిటల్

కశింకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల దశ మారనుంది. ఇప్పటికే సీఎం జగన్ నాడు–నేడు పథకంలో రూ.కోటితో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇపుడు ఈ స్కూల్ ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకానికి ఎంపికైంది. మరోవైపు ఎంపీ బీవీ సత్యవతి చొరవతో ఐవోసీఎల్ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధులతో అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది.



కశింకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాల

- కశింకోట బాలికోన్నత పాఠశాలకు మహర్దశ
- నాడు–నేడు, పీఎంశ్రీతో మారనున్న రూపురేఖలు
- ఐవోసీఎల్ సీఎస్సార్ నిధులతో అదనపు వసతులు



నాడు-నేడు రెండో విడతలో నిర్మిస్తున్న తరగతి గదులు



నాడు-నేడు మొదటి విడతలో సుందరంగా అభివృద్ధి చేసిన తరగతి గదులు

కశింకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు ఊపందుకున్నాయి. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కృషితో 1997లో ప్రత్యేకంగా ఏర్పాటైన బాలికల హైస్కూల్లో ప్రస్తుతం 700 మంది చదువుతున్నారు. అనకాపల్లితోపాటు, అల్లూరి జిల్లా చింతపల్లి, సీలేరు, పాడేరుకు చెందిన బాలికలు కూడా సమీపంలోని సమగ్ర బాలికల వసతి గృహంలో ఉంటూ ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం విద్యార్థుల్లో సుమారు 400 మంది ఏజెన్సీ ప్రాంతానికి చెందినవారే. సమీప మండలాలకు చెందిన వారు మరో 30 మంది వరకు ఉన్నారు. దీంతో ఉభయ జిల్లాల స్థాయి స్కూలుగా పేరుపడింది. ఇక్కడ ప్రస్తుతం 3 నుంచి 10 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. టెన్త్ మినహా మిగిలిన తరగతులు ఆంగ్ల మాధ్యమంలోనే జరుగుతున్నాయి. టెన్త్ పరీక్షల్లో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది ఇద్దరు విద్యార్థులు ఐటీకి ఎంపికై స్కూల్ ఖ్యాతిని ఇనుమడింపజేశారు.

పీఎంశ్రీతో అదనపు వసతులు

దేశ వ్యాప్తంగా పీఎంశ్రీ పథకంలో ఉత్తమ ఫలితాలతో సమర్థవంతంగా నడుస్తున్న స్కూళ్లను ఎంపిక చేసి, కేంద్రం 60 శాతం నిధుల్ని అందించనుంది. మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో మండలానికి ఒక స్కూల్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈసారి స్థానిక బాలికల హైస్కూల్‌ను పీఎంశ్రీ పథకానికి తాజాగా ఎంపిక చేశారు. ఈ పథకంలో అదనంగా కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీతోపాటు డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. ఇప్పటికే ఈ పథకం కింద కేంద్రం నుంచి రానున్న నిధుల కోసం బ్యాంకు అక్కౌంటు ప్రారంభించారు. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే సదుపాయాలు మరింతగా మెరుగుపడతాయి.

నాడు–నేడుతో అభివృద్ధి బాట

ఇప్పటికే సీఎం జగన్ ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకంలో మొదటి విడతగా రూ.61 లక్షలతో శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టారు. రంగులు, రోడ్లు వేసి అందంగా తీర్చిదిద్దారు. రెండో విడత నిధులు రూ.36 లక్షలతో మూడు అదనపు గదులను నిర్మిస్తున్నారు. ఆగస్టు నెలాఖరుకు వీటిని పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. డిజిటల్ విద్య నిర్వహణకు 3 నుంచి 5 తరగతులకు తాజాగా స్మార్ట్ టీవీలను సమకూర్చారు. 6 నుంచి 10 తరగతులకు 9 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ను త్వరలో సమకూర్చనున్నారు.

ఎంపీ చొరవ.. ఐవోసీఎల్ సాయం

విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తరగతి గదుల వరండాలో చేయాల్సి వస్తోంది. దీంతో ఈ విషయాన్ని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి దృష్టికి పాఠశాల సిబ్బంది తీసుకెళ్లారు. ఎంపీ సిఫార్స్ మేరకు సీఎస్సార్ నిధులు రూ.30 లక్షలతో భోజనశాల, కిచెన్‌షెడ్ నిర్మించేందుకు విశాఖలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఇప్పటికే ఇందుకు అవసరమైన పత్రాలను తీసుకుని, పనులు చేపట్టేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఈ పనులన్నీ పూర్తయితే జిల్లాలోనే అత్యంత సౌకర్యాలతో కూడిన, ఆదర్శవంతమైన స్కూల్‌గా రూపుదిద్దగలదని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం



మా హైస్కూల్ పీఎం శ్రీ పథకానికి ఎంపికైంది. దీనివల్ల స్కూల్‌కి అదనపు సదుపాయాలు సమకూరతాయి. ఇప్పటికే నాడు–నేడు పథకంలో రూ.61 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి. రెండో విడతలో రూ.36 లక్షలతో తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ప్రోత్సాహంతో డైనింగ్ హాల్, కిచెన్, గార్డెన్ నిర్మించడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ముందుకు రావడం అభినందనీయం. త్వరలోనే పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

–ఎం.ఎస్.స్వర్ణకుమారి, హెచ్‌ఎం, జెడ్పీ బాలికల హైస్కూల్

ఉద్యమంలా జగనన్న సురక్ష



ధ్రువ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో రవికుమార్

కశింకోట: జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి రోజారాణి అన్నారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంత్రి జయరజని అధ్యక్షతన బుధవారం స్థానిక 1, 3 సచివాలయాలకు సంబంధించి ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 527 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్వర ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్ల మంది లబ్ధిపొందుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కశింకోట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ధ్రువపత్రాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి అర్హులకు సత్వరమే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తుల సేకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించారు. హెల్త్ క్లినిక్‌ల వైద్య, ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘ నూతన కార్యవర్గం



తాళ్లపాలెంలో మొక్కలు నాటుతున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సచివాలయం-2కు స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి గ్రామైక్య సంఘ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలిగా చిన్ని నూకరత్నం, కార్యదర్శిగా కాయల భూదేవి, కోశాధికారిగా చిన్ని లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వెలుగు ద్వారా స్వయం సహాయక సంఘాలకు పర్యావరణ పరిరక్షణ, ఫల సాయం కోసం నాటేందుకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వాటిని అక్కడి నూకాంబిక ఆలయం వద్ద నాటారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అభినందన

కశింకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థినులను పాఠశాల సిబ్బంది బుధవారం అభినందించారు. ఈ ఏడాది పదో తరగతిలో పాఠశాల నుంచి అత్యధిక మార్కులు పొందిన ఉగ్గిన మౌనిక ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, భీశెట్టి తేజశ్రీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి ఆధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు అభినందించి, సత్కరించారు.

అజోలా మదర్‌ఫిట్ తయారీపై శిక్షణ

పరవాడ: వరి పంటలో నత్రజని ఉత్పత్తి, కలుపు నివారణ కోసం అజోల మదర్ ఫిట్ అనేక విధాలుగా దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి డి.మహాలక్ష్మి చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తానాంలో బుధవారం పైల రామారావు పంట పొలంలో వరి పంటలో ఉపయోగించనున్న అజోల మదర్‌ఫిట్ తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు

అనకాపల్లి రూరల్: ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం అనకాపల్లి గుండాల కూడలిలోని ఒక ప్రైవేటు భవనంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ఖాతాదారులంతా వీటి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆధార్ బయోమెట్రిక్ వివరాలను మై ఆధార్ యాప్ లేదా యూఐడీ వెబ్‌సైట్ ద్వారా లాక్ చేసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులకు స్పందించవద్దన్నారు. ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అనుసరిస్తూ నేరగాళ్లు ఖాతాల్లో సొమ్మును కొల్లగొడుతున్నారని, అప్రమత్తంగా ఉండటం తప్ప మరో మార్గం లేదన్నారు. తమ బ్యాంకు అందిస్తున్న వివిధ రుణ సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, క్యాషియర్ కుంచంగి శంకరరావు, ఖాతాదార్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో శ్రీరావాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు రూ.2 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు ఆయన సోదరుడు, మండల వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ బుధవారం గ్రామ పెద్దలు బోను గంగునాయుడుతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం చెక్కు అందజేశారు.

తోడపెద్దు సమాధిని దర్శించుకున్న కొణతాల



తోడపెద్దు సమాధి వద్ద కొణతాల రామకృష్ణ

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం ప్రాంతంలో తోడపెద్దును ఖననం చేసిన స్థలాన్ని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ బుధవారం దర్శించుకున్నారు. పెద రామస్వామి ఆలయ ఆవరణలో ఉండే తోడపెద్దు ఇటీవల మరణించింది. ఈ తోడపెద్దును పూర్వీకుల నుంచి దైవ కార్యక్రమాల్లో ఊరేగించేవారు. కొణతాల వెంట స్థానిక రాజకీయ నాయకులు ఉన్నారు.

గణపతి నిమజ్జనోత్సవ ఏర్పాట్లకు వినతి



జెడ్పీ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న ఆదారి కుమారస్వామి

అనకాపల్లిటౌన్: గణపతి నిమజ్జనోత్సవాలకు స్థానిక శారదానది ఘాట్ వద్ద ఏర్పాట్లు చేయాలని జెడ్పీ ఎస్.వెంకటరమణను వినాయక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదారి కుమారస్వామి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం జెడ్పీకి వినతిపత్రం అందించారు. సెప్టెంబర్ 19న చవితి పురస్కరించుకుని నవరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. పట్టణంలో పలుకూడళ్లలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల అనుపు మహోత్సవానికి శారదానదిని సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల అమ్మకాలను నిరోధించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొడుకుల శ్రీకాంత్, తాటికొండ శ్రీకాంత్, కొణతాల హరనాథ్‌బాబు, దాడి బుజ్జి, వనం చిరంజీవి, మైచర్ల అప్పారావు, మళ్ల భోగలింగం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి అవిరళ కృషి

- ప్రతి సమస్య పరిష్కారానికి తక్షణ నిధుల మంజూరు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వృద్ధురాలి సమస్య వింటున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: అనకాపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని సీహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామంలో ఎంపీపీ సూరిబాబు అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబాల వారీగా పొందిన లబ్ధిని గణాంకాలతో సహా తెలిపారు. వారి సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవాడగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ ప్రాంత ప్రజలకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత తమ ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే ప్రజలు తమకు ప్రతిచోటా ఘన స్వాగతం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. చెరకు పండించే రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుని, వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కల్పించనున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో మౌలికసదుపాయాల కల్పకే నిధులు సమకూర్చామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు, అక్కడికక్కడే నిధులు మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల బాగోగులను పట్టించుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో త్వరితగతిన ధ్రువపత్రాలు



ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు, ఎంపీడీవో నరసింహరావు, సర్పంచ్ కనకరాజు

తుమ్మపాల: ప్రతి కుటుంబానికి అవసరమైన అన్ని రకాల ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కింద ఉచితంగా, త్వరితగతిన అందిస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలో మారేడుపూడి, కుంచంగి గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం వేర్వేరుగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో పాటు అన్ని పథకాలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను శతశాతం పారదర్శకంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. చాలా కాలంగా మంజూరు కాని జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సైతం జగనన్న సురక్షలో తక్షణమే మంజూరు చేసేలా చర్యలు చేపట్టారన్నారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న 11 రకాల ఉచిత ధ్రువపత్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహరావు, తహసీల్దార్ గంగాధరరావు, సర్పంచ్‌లు సాలాపు కనక సన్యాసిరావు, పల్లెల లక్ష్మీనాగేశ్వరరావు, రొంగలి అప్పలనాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్, ఈవోపీఆర్డీ ధర్మారావు, ఏపీఎం సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈగల కృష్ణమూర్తి, మరిపల్లి శోభ, బొడ్డు దేముడుబాబు, పల్లెల సాయి, పోలిన బుజ్జి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో సత్కారం పొందిన ఎంఈవో, ఉపాధ్యాయులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి, నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు కారకులైన ఉపాధ్యాయ సిబ్బందిని, ఎంఈవోను యువ చారిటబుల్ ట్రస్టు బుధవారం ఘనంగా సత్కరించింది. ట్రస్ట్ తరఫున పాఠశాల హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు ఉపాధ్యాయులను, ఎంఈవో కేఎస్‌ఎన్ మూర్తిని శాలువాలు వేసి అభినందన సత్కారం జరిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల వక్తలు ప్రశంసించారు. వచ్చే ఏడాది కూడా ఉత్తమ ఫలితాలతో మరిన్ని ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కొవ్వాడ మోక్షిత, డోకుల బిందు, రాకేష్, సుల్తానాలతోపాటు, బాలికల హైస్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఉగ్గిన మౌనిక, భీశెట్టి తేజశ్రీలకు బహుమతులు అందించి, అభినందించారు. ట్రస్టు చైర్మన్ రేజేటి మారుతి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాది సూరా శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నారు మడుల్లో కలుపు యాజమాన్యంతో మేలు



తుమ్మపాల సమీపంలో వరి నారు మడులను పరిశీలిస్తున్న ఏడీఏ రామారావు

అనకాపల్లి రూరల్: వరి నారు మడుల్లో కలుపు యాజమాన్యం చేపడితే మేలని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.రామారావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని తుమ్మపాల సమీపంలో వరి నారు మడులను ఆయన పరిశీలించారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన నారు మడులు బాగా పెరుగుతున్నాయని రైతులు ఆయనకు తెలిపారు. నారు మడుల్లో అక్కడక్కడ కలుపు యాజమాన్యం సరైన సమయంలో చేపడితే ఏపుగా పెరుగుతాయని రైతులకు ఆయన సూచించారు. కలుపు నివారణ మందులు ఏ మోతాదులో, ఎలా పిచికారీ చేయాలో రైతులకు వివరించారు. వెద పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలాలకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 80 మి.లీ. మందు పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. కలుపు నివారణ కోసం నామినీ గోల్డ్ లీటరు నీటికి 0.5 మి.లీ. కలిపి స్ప్రే చేయాలన్నారు. మినప పంటలో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ రామ చంద్రరావు, రైతు సంఘం నాయకుడు రేగి వెంకట కన్న అప్పారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నిరుపేద వితంతువుకు ఆర్థిక సాయం



భవానీకి నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

తుమ్మపాల: నిరుపేద వితంతువు పట్ల సాయానికి రూ.10 సంస్థ తమ ఉదారత చాటుకుంటుంది. యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం మెలిపాక గ్రామానికి చెందిన సర్వసిద్ధి భవానీ వితంతువు. ఆమెకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు అక్షిత్(8) దివ్యాంగుడు. దీంతోపాటు కుడివైపు రక్తప్రసరణ సరిగా జరగక ఇబ్బంది పడుతున్నాడు. ఈ సమయంలో సాయానికి రూ.10 సంస్థ అధ్యక్షుడు ఏసుబాబు ఈమె పేదరికంపై సంస్థ సభ్యులకు తెలిపి, దాతల సాయంతో రూ.8 లక్షల 71వేల 900 సమీకరించారు. ఆ మొత్తాన్ని బాధితురాలు భవానీకి ఆమె స్వగృహంలో బుధవారం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ శశిధర్, గొర్లి వాసు దేవ నాయుడు, నూకేష్, సారథి, ఖాన్, నరసింగరావు, గణేష్, రాముడు, సాయి, నాగేష్, లహరి, ప్రియాంక, సింధు, తరుణి, తులసి, పద్మ, అంజలి, రమ్య పాల్గొన్నారు.